

# సినిమా న్యూస్

## మళ్లీ స్టార్ట్ కాబోతున్న బిగ్ బాస్ రచ్చా
### అనౌన్స్‌మెంట్ వీడియో వైరల్




బుల్లితెర ప్రేక్షకులు ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్న టైమ్ రానే వచ్చింది. బిగ్ బాస్ సీజన్ 10కు సంబంధించిన అఫీషియల్ అప్డేట్ వచ్చేసింది. ఇప్పటికే 9 సీజన్లు ఎంతో విజయవంతంగా పూర్తి చేసుకుని ఇప్పుడు పదౌవ సీజన్‌కు ముస్తాబైంది. ఈ మేరకు ఓ వీడియోను రిలీజ్ చేశారు టీమ్. ‘బిగ్ బాస్.. ఎన్నో యుద్ధాలు గెలుచుకున్న రాజ్యం మాత్రమే కాదు.. ఎంతోమంది హృదయాలు గెలుచుకున్న మహా సామ్రాజ్యం. ఆ మహా సామ్రాజ్యం గురించి రూల్ చేసే నేను కాదు.. లవ్ చేసే ఫ్యాన్స్ చెబుతారు’ అంటూ నాగార్జున పవర్ ఫుల్ డైలాగ్‌తో స్టార్ట్ అయిన వీడియో ఆద్యంతం అలరించేలా ఉంది. అలాగే బిగ్‌బాస్‌పై రూపొందించిన పాట వీడియోలో ప్రత్యేకంగా నిలిచింది. ‘ఈ ప్రస్థానం మరో కొత్త చాప్టర్‌కి సాక్ష్యం కాబోతున్నది.. ఈసారి మీరు చూడబోయేది బిగ్ బాస్ దశవతారం. ‘బిగ్ బాస్ సీజన్ 10 ఆటలో సవాలు కాదు.. ఆటే సవాలు” అనే క్యాప్షన్‌తో కొత్త సీజన్ ఎంత రసవత్తరంగా ఉండబోతుందో హింట్ ఇచ్చేశాడు నాగ్. ప్రజెంట్ ఈ బిగ్ బాస్ వీడియో వైరల్ అవుతూ సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంటుంది. అయితే గత సీజన్‌లో సెలబ్రిటీలతోపాటు సామాన్యులకూ కూడా అవకాశం కల్పించగా.. అగ్ని పరీక్షను దాటుకుని హౌస్‌లోకి అడుగుపెట్టారు. మారీ ఈసారి కేవలం సెలబ్రిటీలేనా? లేదా సామాన్యులకు కూడా అవకాశం ఇస్తారా? ఇస్తే ఎలాంటి పోటీలు నిర్వహిస్తారు అనేది ఉత్కంఠంగా మారింది.

## ఇరుముడి విడుదల తేదీ ఫిక్స్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రియ భవాని శంకర్ హీరోయిన్‌గా, శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘ఇరుముడి’. ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ తాజాగా అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను 2026 ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ‘ది హార్ట్ ఆఫ్ ఇరుముడి’ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చిన అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ రిలీజ్ డేట్ అప్‌డేట్‌ను విడుదల చేశారు. భక్తి భావోద్వేగాల నేపథ్యంతో సాగే హృద్యమైన ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రవితేజ ప్రేమాభిమానాలు కలిగిన తండ్రి పాత్రలో కనిపించనున్నారు. అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే ఎమోషనల్ కంటెంట్‌తో సినిమా ఉండబోతుందని చిత్ర బృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది. వరుస అపజయాల తర్వాత రవితేజకు ఈ చిత్రం కీలకంగా మారింది. జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ వారు నిర్మిస్తున్నారు.




## కింగ్-టాక్సిక్
### బాక్స్ ఆఫీస్ షేక్ కానుందా?




సినిమా ఇండస్ట్రీలో కొన్ని సందర్భాల్లో ఒకే రోజున భారీ క్రేజ్ ఉన్న సినిమాలు విడుదల అవుతూ ఉంటాయి. అలాంటి సందర్భాల్లో రెండు సినిమాలకు డ్యామేజ్ జరిగే అవకాశం ఉంటుంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. మొదటగా చూస్తే, భారీ క్రేజ్ ఉన్న సినిమా సింగిల్‌గా విడుదల అయితే ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున థియేటర్లు లభిస్తాయి. అదే సమయంలో ఆ సినిమాతో పాటు మరో భారీ మూవీ విడుదల అయితే థియేటర్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే రెండు సినిమాల్లో ఏదైనా ఒక సినిమాకు యావరేజ్ టాక్ వస్తే ఆ సినిమాకు కలెక్షన్లు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. ఇక హిట్ టాక్ వచ్చిన సినిమాపై కూడా కొంత మేర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే మేకర్స్ సాధారణంగా భారీ సినిమాలను ఒకే తేదీన విడుదల చేయడానికి ఇష్టపడరు. కనీసం వారం గ్యాప్ ఉండేలా ప్లాన్ చేస్తారు.

అయితే ఈ ఏడాది రెండు భారీ సినిమాల మధ్య బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ప్రస్తుతం ‘కింగ్’ అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక కన్నడ స్టార్ హీరో యష్ ప్రస్తుతం ‘టాక్సిక్’ అనే చిత్రంలో నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలను కూడా ఈ ఏడాది డిసెంబర్ 24న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే గనుక జరిగితే ఈ రెండు భారీ సినిమాల మధ్య బాక్సాఫీస్ వద్ద తీవ్రమైన పోటీ నెలకొని, ఇండస్ట్రీలో హై వోల్టేజ్ వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బాలయ్య సినిమాలో రాజశేఖర్
### అసలు కొరటాల ప్లాన్ ఏంటి?



టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మూవీ బృందం ఆయనను సంప్రదించగా, రాజశేఖర్ కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

అన్నీ అనుకూలంగా జరిగితే ఈ విషయంపై అధికారిక ప్రకటన మరికొన్ని రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక రాజశేఖర్ ప్రస్తుతం ‘రౌడీ జనార్ధన’ చిత్రంలో విలన్ పాత్రలో నటిస్తున్నారు. ఇదే సమయంలో బాలకృష్ణ-కొరటాల శివ కాంబో మూవీలో కూడా ఆయన భాగం కానున్నారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. రాజశేఖర్ వంటి మంచి క్రేజ్ ఉన్న నటుడు ఈ ప్రాజెక్ట్‌లో చేరితే ఆ అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ‘నాగబంధం’ ప్రమోషన్స్‌కు పక్కా ప్లాన్

విరాట్ కర్ణ హీరోగా, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ హీరోయిన్లుగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 3న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్లను భారీ స్థాయిలో నిర్వహించేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. తాజాగా ‘ది ఎపిక్ బిగిన్స్ టూర్’ పేరుతో ప్రత్యేక ప్రమోషనల్ షెడ్యూల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ టూర్‌లో భాగంగా జూన్ 10న సినిమా సెన్సార్ కార్యక్రమం జరగనుండగా, జూన్ 19న హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు.

అనంతరం జూన్ 20న ముంబై, జూన్ 21న చెన్నై, జూన్ 22న బెంగళూరు, జూన్ 23న కొచ్చిన్‌లో ప్రత్యేక ప్రమోషనల్ ఈవెంట్లు జరగనున్నాయి. అలాగే జూన్ 26న వారణాసిలో ‘వీర నాగ’ సాంగ్ లాంచ్‌ను గ్రాండ్‌గా ప్లాన్ చేశారు. ఇక జూన్ 28న హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్, జూలై 2న ప్రీమియర్ షో నిర్వహించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను అభిషేక్ నామా నిర్వహిస్తుండగా, కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ అంచనాల నడుమ విడుదల కానున్న ఈ సినిమా ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

